క్లుప్తంగా

వైభవంగా అష్టోత్తర శతఘటాభిషేకం



శతఘటాభిషేకంలో పాల్గొన్న భక్తులు

హన్మకొండ అర్బన్: వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో 4వ రోజు సోమవారం సీతారామచంద్ర స్వామికి ఉదయం గణపతి పూజ చేసి, 108 కలశాలతో అష్టోత్తర శత ఘటాభిషేకాన్ని వైభవంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, భాస్కరాచార్యులు తెలిపారు. అనంతరం స్వామివారికి మాన్యసూక్త హోమాలు, గోత్ర నామార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం భజన కార్యక్రమం నిర్వహించి అనంతరం హనుమాన్ మాలధారులకు అన్నదానం చేసినట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ బెండల అర్జున్‌రావు, అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, అంబటి నరేందర్, కార్యవర్గ సభ్యులు కర్రు దశరథ్ కుమార్, గంద్రాతి సుధాకర్, సమ్మక్క, శంకర్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మినీ టెక్స్‌టైల్ పార్కు సొసైటీ ఎన్నిక



శ్రీరాములు, అధ్యక్షుడు

మడికొండ: మడికొండ పారిశ్రామిక వాడలోని కాకతీయ టెక్స్‌టైల్ పార్కు సొసైటీ ఎన్నికలు ఆదివారం రాత్రి జరిగాయి. 364 మంది సభ్యులు ఉండగా.. 9 మంది డైరెక్టర్ల పదవులకు 23 మంది పోటీ చేశారు. ఊరుగొండ శ్రీరాములు ప్యానల్‌కు చెందిన 8 మంది డైరెక్టర్లుగా, కూరపాటి విజయ్‌కుమార్ ప్యానల్‌లో ఒకరు గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ఆదివారం రాత్రి వరకు జరిగింది. గెలుపొందిన డైరెక్టర్లు శ్రీరాములును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా దార్ల రంగస్వామి, కోశాధికారిగా ఆముదాల జ్యోతిభాస్కర్, ఉపాధ్యక్షుడిగా కూరపాటి విజయ్‌కుమార్, డైరెక్టర్లుగా గ్యాదరబోయిన రాధికతిరుపతి, లకుం సదానందం, వెంకట్‌రామ్ సిద్దిరాములు, చెడుపాక ప్రభాకర్, ఇంజమూరి ఉపేందర్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కైరంకొండ రవీందర్, సదానందం, శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ఫ్యాక్టరీ ఓనర్లతో కలిసి కృషి చేద్దామన్నారు.

వేంకటేశ్వరస్వామి రథోత్సవం

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో ఈనెల 19వ తేదీన ప్రారంభమైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పెద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలాదారులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పెద్ద రథాన్ని లాగి తమ భక్తిశ్రద్ధలను చాటుకోగా, స్థానిక రైల్వే స్టేషన్ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు పురవీధుల గుండా సాగిన రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

అసత్య ప్రచారాలు సరికాదు

కమలాపూర్ : కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌పై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని మండలంలోని శంభునిపల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొల్లం రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రణవ్‌పై జమ్మికుంట మండలానికి చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు చేసిన అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. మచ్చలేని ప్రణవ్ లాంటి వ్యక్తులు రాజకీయాల్లోకి రావడం చాలా అరుదని, అలాంటి వ్యక్తిపై బురదజల్లే ప్రయత్నం చేయడం హేయమైన చర్యని తెలిపారు. నిరాధారణ ఆరోపణలు చేసిన వారిపై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణ చర్యలు తీసుకుని సస్పెండ్ చేయడాన్ని ఆయన స్వాగతిస్తామని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

శాయంపేట : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ఏఓ గంగాజమున అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను, విత్తనాలను, ఎరువులను పరిశీలించారు. అనంతరం విత్తనాల కొనుగోలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన అనంతరం రసీదు తీసుకోవాలన్నారు. లైసెన్స్ కలిగిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, అనామకుల వద్ద కొనుగోలు చేయొద్దని సూచించారు.

ఐనవోలు: ఫర్టిలైజర్ షాపుల యజమానులు విత్తనాలను ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ అడప కవిత హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని కీర్తి, లక్ష్మీ, ఓమ్ శ్రీ, మమత, అన్నపూర్ణ విత్తన దుకాణాలను తనిఖీ చేశారు.

ఓటుహక్కు వినియోగించుకున్న పట్టభద్రులు



హసన్‌పర్తి: ఓటు వేసేందుకు బారులుదీరిన పట్టభద్రులు



ఖిలా వరంగల్: రంగశాయిపేట జూనియర్ కళాశాలలో..



మడికొండలో ఓటు వేయడానికి క్యూలో ఉన్న పట్టభద్రులు

హసన్‌పర్తి: నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఉప ఎన్నిక నగరంలో ప్రశాంతంగా ముగిసింది. హసన్‌పర్తి మండలంలో 5,656 మంది ఓటర్లు ఉండగా, 4,037 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71.37 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నిక కోసం మండలంలో ఏర్పాటు చేసిన ఆరు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. వంగపహాడ్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పోలింగ్ స్టేషన్లు, హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 4పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

బారులుదీరిన ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉదయం నుంచే ఓటర్లు బారులుదీరి కనిపించారు. ఓటు వేయడానికి 30నిమిషాల నుంచి 40నిమిషాల వరకు ఓటర్లు క్యూలో నిలబడ్డారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించారు.

ఖిలా వరంగల్‌లో..

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రంలోని నాలుగు బూత్‌ల్లో (121, 122, 123, 124) 3,947మందికి 2,898 మంది పట్టభద్రులు తమ ఓటును హక్కును వినియోగించుకున్నారు. కరీమాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 125, 126, 127 పోలింగ్ బూత్‌లు, శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో 128, 129, 130వ బూత్‌ల్లో 75శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓటర్లు ఓటు వేశారు. పోలింగ్ సరళిని ఆయా పార్టీల నాయకులు పరిశీలించారు. వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్, కార్పొరేటర్లు పోశాల పద్మ, అరుణ, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, నవీన్‌రాజు, నల్గొండ రమేష్, కర్ర కుమార్, సంగరబోయిన చందర్, పోశాల స్వామి ఉన్నారు.

పోలీసుల బందోబస్తు

వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య పర్యవేక్షణలో రంగశాయిపేట, శివనగర్, కరీమాబాద్‌లో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. విధుల్లో ఎస్సైలు గోవర్ధన్, మున్నీరుల్లాతో పాటు వందలాది మంది పోలీసులు పాల్గొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

మడికొండలో..

మడికొండ: మడికొండలో 1,132 మంది పట్టభద్రులకు 854మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు అధికారులు తెలిపారు. 75శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మడికొండ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సరళిని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి పరిశీలించారు.

48వ డివిజన్‌లో..

కాజీపేట రూరల్: కాజీపేట 48వ డివిజన్ పరిధిలోని దర్గా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు పోలింగ్ సెంటర్‌కు చేరుకొని ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.



కరీమాబాద్‌లో ఓటు హక్కును వినియోగించుకుంటున్న పట్టభద్రులు



మడికొండ పోలింగ్ బూత్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ బారి



ఓటు వేసిన అశోక్‌రెడ్డి



విజయ్‌చందర్ రెడ్డి



దర్గా స్కూల్‌లో ఓటు వేయడానికి లైన్‌లో ఉన్న ఓటర్లు



ఓటు వేసిన అనంతరం దివ్యాంగుడిని వీల్‌చైర్‌పై బయటకు తీసుకొస్తున్న సహాయకులు



పింగిళి కళాశాలలో ఓటు వేసిన బీఆర్‌ఎస్ నేతలు, తదితరులు





ఓటు హక్కు వినియోగించుకున్న పెన్షనర్లు



సిరా చుక్కను చూపుతున్న దంపతులు



హసన్‌పర్తిలో..



వడ్డేపల్లిలో సెల్ఫీ దిగుతున్న దంపతులు



ఓటర్ల డబ్బులు మింగారు

- ఎమ్మెల్యే ఎదుట కార్యకర్తల ఆవేదన
- క్రాస్ ఓటింగ్ జరిగిందంటూ ఆందోళన



ఎమ్మెల్యే ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న నాయకులు

హసన్‌పర్తి: ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్లకు పంచేందుకు ఇచ్చిన డబ్బులను కొంత మంది మింగారని కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన పోలింగ్ సరళిని పరిశీలించడానికి ఎమ్మెల్యే నాగరాజు వచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు తమ ఆవేదనను ఆయన ఎదుట వెలిబుచ్చారు. హసన్‌పర్తిలో ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బులు పంపిణీ చేసినట్లు లెక్కలు రాసుకున్నారని, వాస్తవంగా ఒక్క పైసా కూడా ఓటర్లకు అందలేదని తెలిపారు.

ఓటర్లను ప్రభావితం చేయకపోవడంతో పార్టీ నాయకులు డబ్బులు పంచుకున్నట్లు ఓటర్లు అభిప్రాయానికి వచ్చి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఎమ్మెల్యేకు నాయకులు వివరించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోనే కాకుండా మెజారిటీ గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు వెలిబుచ్చాయి. కాగా, పార్టీలో పనిచేస్తున్న సీనియర్లకు అసలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ నిర్వహించే కార్యక్రమాల సమాచారం కూడా తమకు ఇవ్వడం లేదని ఎమ్మెల్యే నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన రావు పద్మ



పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న రావు పద్మ

హన్మకొండ: పట్టభద్రులు ఎన్నికల పోలింగ్ సరళిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పరిశీలించారు. హనుమకొండ జిల్లాలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఓటు హక్కు కలిగి ఉండి పోలింగ్ బూత్‌కు రాని వారి వివరాలు సేకరించి వారు ఓటు వేసేలా చూడాలని నాయకులకు సూచించారు.



మడికొండలో బీజేపీ నాయకులతో మాజీ ఎమ్మెల్యే యెడల లక్ష్మీనారాయణ

దామోదర్‌కు విశ్వకర్మ లెజెండరీ అవార్డు



దామోదర్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

హన్మకొండ కల్చరల్: హైదరాబాద్‌కు చెందిన విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ ఎనిమిదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన, సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న వివిధ రాష్ట్రాల్లోని 55 మంది విశ్వబ్రాహ్మణులకు విశ్వకర్మ లెజెండరీ అవార్డులను ప్రదానం చేశారు. ఈమేరకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గత ఆదివారం జరిగిన కార్యక్రమంలో వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞానపీఠం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీమంతుల దామోదర్‌కు విశ్వకర్మ లెజెండరీ అవార్డు ప్రదానం చేశారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో పలు వ్యాసాలు, రెండు గ్రంథాలు రాసినందుకు విశ్వకర్మ లెజెండరీ అవార్డుకు దామోదర్ ఎంపికయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు విశ్వనాథుల పుష్పగిరి, తల్లోజు ఆచారి, దాసోజు లలిత, ముఖ్యఅతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత వేలు ఆనందచారి పాల్గొన్నారు. దామోదర్‌కు తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భట్టు రమేష్, వరంగల్ జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుకలు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998 –1999లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా ఒకచోట చేరి గత స్మృతులను గుర్తుచేశారు. ప్రతిఏటా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు బాబురావు, పరశురాములు, అక్బర్, ప్రతాప్, దామోదర్‌ను సన్మానించారు.

దరఖాస్తు చేసుకోవాలి

శాయంపేట : ఎస్సీ గురుకులాల సొసైటీ పరిధిలోని నాన్ సీఓ విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

రోడ్లపై పారుతున్న మురుగు నీరు



కాశిబుగ్గ జంక్షన్‌లో పారుతున్న మురుగునీరు



కాశిబుగ్గ: రోడ్డుపైకి చేరిన మురుగునీరు



ఫాతిమానగర్ జంక్షన్ సమీపంలో నిండిన డ్రైనేజీ

- పట్టించుకోని బల్దియా అధికారులు

కాశిబుగ్గ: వరంగల్ – నర్సంపేట రహదారిలోని కాశిబుగ్గ జంక్షన్ వద్ద మురుగునీరు పారుతోంది. దాంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంకట్రామ జంక్షన్ నుంచి పోచమ్మమైదాన్ వరకు రహదారి అభివృద్ధిలో భాగంగా ఇరువైపులా పైపులతో డ్రెయినేజీ నిర్మించారు. ఆ పైపుల్లో వ్యర్థాలు పేరుకుపోయినప్పటికీ బల్దియా పారిశుద్ధ్య కార్మికులు పట్టించుకోకపోవడంతో రెండు రోజులుగా మురుగు నీరు రహదారిపై పారుతోంది. పక్కనే కాశిబుగ్గ మున్సిపల్ కాంప్లెక్స్ ఉన్నప్పటికీ అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయం. చిన్నపాటి వర్షం వచ్చినా ఈ ప్రధాన రహదారి మురుగునీరుతో నిండుతోంది. పైపుల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్లనే ఈ దుస్థితి నెలకొందని నగర వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫాతిమానగర్‌లో నిండిన కాల్వలు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్ సమీపంలోని పలు వీధుల్లోని డ్రెయినేజీలు నిండి రోడ్లపైకి మురుగు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఫాతిమానగర్ మెయిన్ రోడ్డు సమీపంలోని బాబా ఫంక్షన్ హాల్ ఎదుట ఉన్న డ్రెయినేజీలోని మురుగు నీరు పలు వీధుల రోడ్లపైకి చేరింది. దాంతో స్థానికులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దేవాలయ వార్షికోత్సవం ప్రారంభం



హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయ 53వ వార్షికోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకల్లో భాగంగా మొదటిరోజు సోమవారం ఆలయ అర్చకుడు యల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు, విఘ్నేశ్వర స్వామికి 53 లీటర్ల చెరుకు రసంతో అభిషేకం, గరికార్చన, హోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పూజలను పర్యవేక్షించారు.